చెత్త ఇలా..అవస్థల్లో స్థానికులు

పట్టించుకోని శానిటేషన్ సిబ్బంది ● రోగాల బారిన పడితే బాధ్యులు ఎవరు..!

బంజారాహిల్స్,డిసెంబర్ 27: జీహెచ్ఎంసీ సర్కిల్ -18 పరిధిలో చెత్త తరలింపులో శానిటేషన్ విభాగం సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. బస్తీలు, కాలనీలు తేడాలేకుండా పలు ప్రాంతాలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు విపరీతమైన దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

● బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి సింగాకుంటకు వెళ్లే రోడ్డుపక్కన భారీగా చెత్తా చెదారం డంపింగ్ చేస్తున్నారు. మూడు నాలుగు బస్తీలతో పాటు పక్కనున్న కాలనీల నుంచి ఇష్టారాజ్యంగా చెత్త తెచ్చి బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే చెత్తను తరలించాల్సిన జీహెచ్ఎంసీ శానిటనేషన్ విభాగం సిబ్బంది సరైన రీతిలో స్పందించడం లేదని ఆరోపణలున్నాయి. పెద్ద

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12నుంచి సింగాడకుంటకు వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎత్తున పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు రెండుమూడు ట్రిప్పులు వేయాల్సిన ట్రిప్పర్లు ఒకే ట్రిప్‌కు పరిమితం అవుతున్నారు. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు.

● ఒకవైపు చలికాలం కావడంతో దోమల విజృంభణ కొనసాగుతుండగా, ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్తతో రోగాలు ప్రబలే అవకాశం ఉంది.

● బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3, రోడ్డు నంబర్ 14, నందినగర్, జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ప్రాంతాల్లో సైతం ఇదే విధమైన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,డిసెంబర్ 27: చెట్ల కొమ్మల కత్తిరింపు, విద్యుత్ కేబుళ్ల మరమ్మతులతో పాటు ఇతర పనుల కారణంగా బంజారాహిల్స్ సబ్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీ ఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

● బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణ ఎడికరాల స్టూడియో, మోర్ సూపర్‌మార్కెట్ లేన్, కాకర్ల సుబ్బారావు నివాసం, వెంకటగిరి దిగువ ప్రాంతాలు,

● బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13లోని శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట దాకా కరెంట్ సరఫరా ఉండదు.

● అమీర్‌పేటలోని నాగార్జుననగర్ కాలనీ, విజయా టవర్స్, సోనాబాయి టెంపుల్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 25నుంచి 32 తదితర ప్రాంతాల్లో,

● జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 52, 45,53 ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదు.

● బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10, వాటర్ హౌస్, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసు, క్యాన్సర్ ఆస్పత్రి,

● జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41,70, నందిహిల్స్, ఐఏఎస్ క్వార్టర్స్, సైలెంట్ వ్యాలీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

పనుల కారణంగా..

ఎర్రగడ్డ: ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాలాజీ స్వర్ణపురి(బీఎస్పీ) కాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నేతాజీనగర్ ప్రాంతాలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజీవ్‌నగర్ కాలనీ, శ్రీరాంనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11: 30 వరకు టాటానగర్, బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, మొగల్స్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, రామకృష్ణాహిల్స్, వినాయక్‌నగర్, బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11: 30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలీనగర్, ఆయిషా కాలనీ, అహ్మద్‌నగర్, ప్లేస్ వ్యూ కాలనీ, కింగ్స్ ఎవేన్యూ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతక సాధనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

● తెలంగాణ అథ్లెట్ జీవాంజీ దీప్తి

పుల్లెల గోపీచంద్ అకాడమీలో సిబ్బందితో అథ్లెట్ జీవాంజీ దీప్తి

నేరేడ్‌మెట్, డిసెంబర్ 27 : పారా ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కాంస్య పతకం సాధించడానికి సహకరించిన అందరికీ తెలంగాణ అథ్లెట్ జీవాంజీ దీప్తి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సాయిగోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో దీప్తి జివాంజి మాట్లాడారు. పుల్లెల గోపిచంద్ అకాడమీలో శిక్షణ అందిస్తున్న అసిస్టెంట్ కొచ్, ఫిజియో, మసాజ్, క్యాటరింగ్, అకాడమీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారత్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపిచంద్ మాట్లాడుతూ దీప్తి మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రోత్సహిస్తామన్నారు. జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు

అంబర్‌పేట, డిసెంబర్ 27 : స్కిల్ ఇండియా ప్రోగ్రాం కింద రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు(పీడబ్ల్యూడీ ప్రత్యేక యువత)కు జాబ్‌ప్లేస్‌మెంట్‌తో కూడిన ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును అందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రంజిత్‌కౌర్ తెలిపారు. రీటేల్(కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్), ఐటీ-ఐటీఈఎస్, బీపీఓ-వాయిస్ అండ్ నాన్ వాయిస్ డొమెన్ కోర్సులు, నాన్ డొమెన్, ఎం.ఎస్.ఆఫీస్, టైపింగ్ అండ్ సాఫ్ట్ స్కిల్స్‌లో రెండు నెలల కాలవ్యవధితో కూడిన శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు గలవారు అర్హులని చెప్పారు. ఫొటో, ఆధార్‌కార్డు, ఇంటర్ మెమో, వైకల్యం ధ్రువీకరణ పత్రం(కనీసం 40 శాతం వైకల్యం ఉండాలి) అందజేయాలని పేర్కొన్నారు. జనవరి 3వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని వెల్లడించారు. వివరాలకు శివం రోడ్డులోని ఎల్.జె.మార్కెట్ కాంప్లెక్స్ కార్యాలయంలో గానీ 924 6376667, 9100006993, 8639388102లలో సంప్రదించాలి.

స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలి

కాచిగూడ, డిసెంబర్ 27: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కలిసి గుజ్జ సత్యం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల రూ.4,500 కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో 16 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు కొన్నేండ్లుగా ఫీజులు చెల్లించడంలేదని అన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది ఫీజులు కట్టలేక, విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే జనవరి 3న చలో కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న బీసీ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

జేబీ రాజుకు జనబాంధవ పురస్కారం ప్రదానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ శ్రుతిలయ ఫౌండేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఆర్గనైజేషన్ అభినందనలతో అంబేద్కర్ వాది డా. జేబీ రాజు అమృతోత్సవం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి జే గీతారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పలువురు దళిత నేతలు విచ్చేసి డా.జేబీ రాజుకు జనబాంధవ పురస్కారంతో జేబీ రాజు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం జేబీ రాజు పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సభకు ముందు శ్రుతిలయ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి నవరస గాయని ఆమని బృందంచే సినీసుస్వరాల కార్యక్రమాన్ని నిర్వహించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

– రవీంద్రభారతి, డిసెంబర్ 27

చర్లపల్లి నుంచి బోరబండ, సికింద్రాబాద్‌కు

ఆర్టీసీ అదనపు బస్సులు

బోడుప్పల్, డిసెంబర్ 27 : చర్లపల్లి నుంచి బోరబండ, సికింద్రాబాద్‌కు అదనపు బస్సులు ప్రారంభించినట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో ఆమె మాట్లాడుతూ.. చర్లపల్లి నుంచి ఉప్పల్, రామంతాపూర్, పంజాగుట్ట మీదుగా బోరబండకు ఉదయం 8.35 గంటల నుంచి సాయంత్రం 7.35 గంటల వరకు ప్రతి 40 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అదే విధంగా మల్లాపూర్, హబ్సిగూడ, మెట్టుగూడ మీదుగా ఉదయం 4.20 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ప్రతి 8 నిమిషాలకు బస్సు ఉంటుందని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అదనపు ట్రిప్పులను పెంచినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలను

సీఎం దృష్టికి తీసుకెళ్లండి

జలమండలి ఉద్యోగులు

రవీంద్రభారతి, డిసెంబర్ 27 : ధీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి తదితరులు కలిసి ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.

మన్మోహన్ సింగ్ మరణం

దేశానికి తీరని లోటు

హిమాయత్‌నగర్, డిసెంబర్27: ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లి ఉల్లాఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మంత్రిగా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి ఎంతోమందిని పేదరికం నుంచి గట్టెక్కించారని, ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి వెలకట్టలేని సేవలు అందించారని గుర్తుచేశారు.ఏ బాధ్యత నిర్వహించినా ప్రతిచోటా తనదైన ముద్ర కనబరిచారని,దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు.సమర్థవంతమైన నాయకత్వానికి పేరు గాంచిన ఆయన దేశ సంక్షేమం కోసం బలమైన నిబద్ధతతో కృషి చేశారని కొనియాడారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కార్వాన్, డిసెంబర్ 27 : కార్వాన్ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తున్నట్లు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని జియాగుడా, కార్వాన్, గుడిమల్కాపూర్ డివిజన్లలో ఆయన శుక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్‌లోని ప్రజలకు ఇబ్బందులు ఎదురు కాకుండా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మంచినీరు. సక్రమమైన డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, వీడీసీసీ రోడ్లు తదితర సౌఖర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు నిరంతరం కృషి

మధుబన్ కాలనీలో కార్డన్ సెర్చ్‌లో భాగంగా నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకుంటున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 27: నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధుబన్ కాలనీలో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో తనిఖీలు చేపట్టి నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నెంబర్ ప్లేట్లు, సరైన దస్తావేజులు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. నేరాలను నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు నాఖాబందీ, కార్డన్ సెర్చ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇండ్లను అద్దెకు ఇచ్చే సమయంలో కిరాయికి వచ్చిన వారి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వారి పూర్తి సమాచారం తీసుకున్న తరువాతనే ఇంటిని అద్దెకు ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలను ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చాలా ప్రాంతాల్లో నిషేధిత గుట్కాలు, గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందుతుందన్నారు. వీటి అమ్మకాలను తాము ఉపేక్షించమన్నారు. ఎవరైనా గంజాయి సేవించినా, అమ్మకాలు జరిపినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో ఎస్సై పైడి నాయుడు, ఏఎస్సై వెంకట్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 27 : సమగ్ర శిక్షా ఉద్యోగులు గత 18 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరహార దీక్షా పోరాటాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబుయాదవ్ అన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన రాంబాబు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అధికారంలోకి రావడానికి ఉద్యోగులకు అడ్డగోలు హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి గెలిచిన అనంతరం మొఖం చాటేయడం సిగ్గుచేటన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలిపిన రాంబాబుయాదవ్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

విజేతగా నిలిచిన టీమ్‌కు రూ. 50 వేల నగదుతో పాటు బహుమతి అందజేస్తున్న కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 27 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లిలో నిర్వహించిన తెలంగాణ జూనియర్ ప్రీమియర్ లీగ్ శుక్రవారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొండుపల్లిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన మొత్తం 16 టీమ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. వాటిలో ఏకే 47 క్రికెట్ టీమ్ విజేతగా నిలిచిందన్నారు. విజేతగా నిలిచిన టీమ్‌కు రూ.50వేల నగదును కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ అదజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ పరమేష్ గౌడ్,దొడ్డ పెంటయ్య,కొండ దర్శన్‌గౌడ్, రాజు, రమేష్,శివశంకర్‌గౌడ్, సాయిశంకర్, చిట్టి నాగరాజులతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

మెహిదీపట్నం, డిసెంబర్ 27 : ప్రజలు రాత్రిళ్లు వీధులో తిరగాలంటేనే భయపడుతున్నారు. నగరంలో ఉన్నామా? లేక అడవుల్లో ఉన్నామా ? అన్నట్లు పరిస్థితి తయారయ్యిందని కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్, గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం పని తీరు అధ్వాసంగా తయారయ్యిందని, మూడు నెలల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని అంటున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించడం లేదని ప్రజలే కాక కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు వెలగక పోవడంతో బస్తీలలో ఇటీవల దొంగతనాలు పెరిగిపోయాయని, తరచూ గొడవలు కూడా జరుగుతున్నాయని ఆయా డివిజన్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ విషయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టోలిచౌకిలో వెలుగని వీధి దీపాలు

'అంజయ్య సేవలు చిరస్మరణీయం'

చిక్కడపల్లి, డిసెంబర్ 27: సంఘ సేవకుడు డాక్టర్ అంజయ్య సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్ సాయిబాబా మందిరం మేనేజింగ్ ట్రస్టీ చైర్మన్ మందలపు గాంధీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయం వద్ద దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఎం.అంజయ్య మూడో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీ హాజరై అంజయ్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మరాజా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి పూజల్లి రాజశేఖర్, హరినాథ్, చుక్కన్న, యాదగిరి, చంద్రమోహన్, కిషన్, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, చైన్ల మధు, బీజేపీ నాయకుడు పుస రాజు, ఉమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

- బీసీ బిల్లుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం కాని బీసీల సమస్యలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఏపీపీ బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు ఎలగాల నూకలమ్మ

రవీంద్రభారతి, డిసెంబర్ 27 : పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంపై ఒత్తిడి పెంచి బీసీ బిల్లును పార్లమెంట్‌లో పెట్టేవిధంగా కృషిచేయాలని , 30 ఏండ్లుగా బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పోరాటం చేస్తున్నా ఏ ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీ డిమాండ్లపై హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో ఆర్. కృష్ణయ్య సమావేశాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి ఎలగాల నూకలమ్మయాదవ్ సభా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్‌డీఏ భాగస్వామి అయినందున బీసీ బిల్లు పార్లమెంట్‌లో పెట్టే విధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ఆయన చెప్పారు. రాజకీయ రిజర్వేషన్ల కోసం 30 ఏండ్లుగా పోరాడుతున్న బీసీల చిరకాల ఆకాంక్షను నెరవేర్చి బీసీల పక్షాన నిలబడాలని ఆయన పేర్కొన్నారు. బీసీ బిల్లు కోసం పార్లమెంట్ వద్ద 102 సార్లు, 66సార్లు ప్రధాన మంత్రులను కలిసి చర్చలు జరిపినట్లు వివరించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బీసీల సమస్యలకు పరిష్కారం చూపడంలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా ఇన్‌చార్జి అధ్యక్షురాలు ఎలగాల నూకలమ్మయాదవ్ మాట్లాడుతూ.. బీసీ డిమాండ్ల కోసం జనవరి చివరి మాసంలో ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన అమరావతి వేదికగా బీసీ మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు సీఎం చంద్రబాబునాయుడు, లోకేష్, టీడీపీ బీసీ మంత్రులు హాజరుకానున్నట్లు నూకలమ్మ తెలిపారు. ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటకోటేశ్వరరావును నియమించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్, బీసీ సంక్షేమ జంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, వరప్రసాద్, ఆదిశేషు, మల్లేశ్, లక్ష్మణ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.